గ్రంథాలయం, కడప
Acc. No..............
తేదీ..................

# కరిగిన నీరు

సుందరం చాలా భయపడుతున్నాడు. కాని అవతలి మనిషి పట్టువిడవ లేదు. అతని చేయి గట్టిగా పట్టుకుని తనవైపుకు లాగుతున్నాడు. పిస్తోలు లేదన్న మాటేగాని చేతిపట్టే చాలు ప్రాణం హరించిపోయేందుకు. "నన్ను అట్లా లాగవద్దు. నువ్వు రమ్మన్న చోటుకు వస్తాను" అన్నాడు సుందరం నీరసంగా.

"ఇప్పుడు అట్లాగే అంటావు. ఈ పట్టు వదిలితే నువ్వు నా మాట వింటావా? ఇందాకటి నుంచి ఎంత హఠం చేశావు. నోరు మూసుకుని నా వెనకాల రా" అన్నాడు ఆ మనిషి. అతని గొంతులో యే మాత్రం దయ, దాక్షిణ్యం లేవు. మూర్తీభవించిన క్రౌర్యం అతను.

సుందరానికి ఎదురుతిరుగుదా మనిపించింది. లాభం లేదు. తన శక్తి చాలదు. అయితే యేం చేయాలి? బానిసలాగ యితని వెనకాల అడుగులో అడుగు వేసుకుంటూ పోవలసిందేనా?

అయినా ఎవరు యితను? తననెందుకు యిలా యాతన పెడుతున్నాడు? పుట్టి బుద్ధియెరిగి తను యెవరికీ అపకారం చేయలేదు. అసలు అలా అపకారం చేయగల అవకాశమే తనకు కలగలేదు - యింతవరకు. అందుచేతనే తప్పనిసరిగా మంచివాడుగా వుండిపోయాడు.

అతనికళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. నయం. తనకు అతని వీపు మాత్రమే కనిపిస్తోంది గనుక కొంతలోకొంత బతికి పోయినాడు. లేకపోతే ఆ ఎర్రటి కళ్ళ వంక చూస్తూనే తన ప్రాణ వాయువులు అనంత వాయువుల్లో కలిసిపోయేవి.

అట్లా కొంతదూరం నడిపించుకు పోయాడు. అంతా ఒక్కమారుగా చీకటి అయింది. తనకు దారి కనిపించటంలేదు. తనకు కళ్లు వుండీ లేనివాడు అయిపోయినాడు. ఇంకా తన చేయి అతని పట్టులోనే వుంది. ఒక్కమారుగా బలవంతంగా గుంజినట్లు అయింది. నెత్తికి యేదో తగిలింది. బహుశ

ద్వారం అయివుంటుంది. నెత్తిమీద పెద్ద బొప్పి కట్టినట్లయింది. తన చేతిని ఉడుంపట్టులాగ బంధించిన పట్టు యిప్పుడు లేదు. తనచేయి తిరిగి స్వతంత్రం అయింది. ఇప్పుడు తనను యెవరూ బలవంతం చేయడంలేదు. ఈ ఆలోచన యిచ్చే హాయి యింకా వంట పట్టకుండానే అతని శరీరం అంతా ముందుకు పరుగెత్తింది వెనుకనుంచి యెవరో తోసినట్లు. అతను దబాలున యెదురుగా ఉన్న గోడకు కొట్టుకున్నాడు.

నుదురుకు దెబ్బ తగిలింది. కళ్ల ముందు పచ్చగా వెలుతురు కనిపించింది. ఒక్క క్షణం అంతే. మళ్ళీ చీకటి, రెండు చేతులతోను నుదురు, తల రాసుకున్నాడు. తడి తడిగా తగుల్తోంది, బహుశ రక్తం కారుతోందేమో? అయ్యో! తన రక్తం.

"ఈ చీకటి కొట్లో పడిచావు" పెద్దగా కేక వినిపించింది. ఇంతసేపూ తనను నెట్టుకుంటూ వస్తున్న మనిషే అయివుంటాడు. అతను తనకు దూరంగా వెళ్ళిపోతున్నట్లు అడుగుల చప్పుడు వినిపిస్తోంది.

సుందరానికి తన అసహాయస్థితికి యేడుపు వచ్చింది. పెద్దగా కేకవేసి యేడవనారంభించాడు. పది మంది రాక్షసులు తన శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసుకుతింటున్నట్లు బాధగా అరిచాడు. కీచుగొంతుతో పెకిలించుకుంటూ కేకలు పెట్టాడు.

– సుందరానికి యీ కేకలతో మెలుకువ వచ్చేసింది. తనచుట్టూ చూచుకున్నాడు. తను మంచం మీదనే పడుకుని వున్నాడు. చీకటి కొట్లో పడిలేడు. తన నెత్తికి, నుదుటికీ దెబ్బలు లేవు. రక్తం కారడంలేదు. అయితే యిందాకటి వేదన అంతా కల అన్నమాట. అబ్బ! ఎంత భయంకరమైన కల. సుందరం మంచంమీదనే లేచికూర్చున్నాడు. పక్క మంచం మీద శారద, బాబు పడుకుని వున్నారు. శారద సన్నగా ఊపిరి పీలుస్తోంది. బాబు ఆమె మీదకి చేయివేసుకుని రికామిగా పడుకుని నిద్రపోతున్నాడు. సుందరానికి ఒక్క క్షణం శారదను నిద్రలేపి తన పీడకల చెప్పాలనిపించింది. మళ్ళీ మరుక్షణంలోనే - హాయిగా నిద్రపోతున్న మనిషిని లేపడం ఎందుకులే అనిపించింది. సుందరం పక్కమీదనుంచి సొంతం పయికి లేచాడు. రెండడుగులు వేయగానే టేబుల్ కనిపించింది. గబగబ దానిమీద వున్న గడియారం చేతిలోకి తీసుకొని టైం చూచాడు. రెండున్నర! ఇంతే! అంటే తెల్లవారటానికి యింకా నాలుగు గంటల విరామం వున్నదన్నమాట. కారణం యేమిటి? కారణం యేదయినా విపరీతమయిన భయంమటుకు కలుగుతోంది. సుందరం టేబుల్ ముందున్న

స్టూల్ మీద కూలబడ్డాడు. గదిలో చీకటి లేదు. బెడ్ లైట్ కాంతి గది అంతా సమంగా ఆవరించుకుంది. సుందరం ఒక మారు తనకు వచ్చిన కలను నెమరు వేసుకున్నాడు. అతి చిన్న వివరాలతోనూ అది గుర్తువుంది; యీ క్షణంలో. బహుశ తెల్లవారితే మరిచిపోవచ్చును. ఇలా అనేక కలలు - మంచివి చెడ్డవీ కూడా - తెల్లవారిన తరువాత మరిచిపోవడం జరుగుతూ వుంది యిదివరకల్లా. అయినా తనకు యింతవరకూ యింత భయంకరమయిన కల (దుస్స్వప్నం) రాలేదు. ఇది కలగనుక సరిపోయింది. అదే నిజం అయినట్లయితే తన బతుకు ఏమయేది? తను యిలా స్థిమితంగా గాలి పీలుస్తూ కూర్చోగలిగేవాడా?

కల అంతా నెమరు వేసుకున్న తరువాత మరింత భయం అనిపించింది సుందరానికి. బల్లమీదనుంచి లేచి నీళ్ళ గదిలోకి వెళ్ళాడు. పంపు తిప్పి చల్లటి నీళ్ళతో ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని యివతలకు వచ్చాడు. నిద్రమత్తు అంతా వదిలిపోయింది. ఇప్పుడు మళ్ళీ నిద్రపట్టటం కూడా కష్టమే. అయినా హాయిగా నిద్రపోయే పరిస్థితా యిది? -- అనిపించింది. తనకు యిటువంటి కల ఎందుకు వచ్చింది?

పడుకునే ముందు తను యిటువంటి పుస్తకం చదివాడో, యేమేమి ఆలోచనలతో నిద్రపోయినాడో గుర్తుతెచ్చుకుందుకు ప్రయత్నించాడు. అలాగే - యీ రోజంతా తను యేం చేశాడు, యెవరెవరితో మాట్లాడాడు, యెలా గడిపాడు -- అంతా గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు.

ప్రతిరోజు మాదిరే ఆ రోజు మామూలుగా ఆఫీసుకు వెళ్ళాడు. మామూలు పనులు చూచుకున్నాడు. ఆఫీసులో యేమీ విశేషం జరగలేదు. ఈ రోజున ప్రత్యేకించి యితరులతో యెక్కడ మాట్లాడింది కూడ లేదు.

ఆఫీసు నుంచి యింటికి వచ్చిన తరువాత - సాయంత్రం న్యూస్ పేపరు చదువుకున్నాడు. కాస్సేపు మేడమీద బాల్కనీలో పచార్లు చేశాడు భోజనం చేశాడు. ప్రేమ కథల పుస్తకం చదువుతూ పడుకున్నాడు. అలాగే నిద్రపట్టింది. చదువుతున్న పుస్తకం మూసి నిద్రలోపడిపోయాడు. శారద వంట యింట్లోంచి యివతలకు రావడం కూడా తనకు గుర్తులేదు. బహుశ తను పూర్తిగా నిద్రలో పడిపోయిం తర్వాత ఆమె పడకగదిలోకి వచ్చివుంటుంది.

ఆ! ఆఫీసునుంచి యింటికి వస్తుండగా ఒక కొత్త సంఘటన జరిగింది - తనతో పాటే మిత్రులు మూర్తి, ఆంజనేయులు వున్నారు. ముగ్గురూ యింటికి తిరిగి వస్తూవుండగా దారిలో ఆంజనేయులు యిలా అన్నాడు:

"ఈ సాయంకాలం... చలి చలిగా వుంది. రాత్రికి వాన వస్తుందేమో--"

తరువాత, సంభాషణ వాతావరణం మీదికి మళ్ళింది. తను ప్రత్యేకంగా మాట్లాడిందంటూ యేం లేదు, స్నేహితులు యిద్దరూ మాట్లాడుతున్నది వింటూ నడుస్తున్నాడు.

మూర్తే ఒక స్థితిలో అన్నాడు: దీన్ని 'విస్కీ వెదర్' అంటారు. ఈ పళంగా బార్‌కు వెళ్ళి ఓ నాలుగు పెగ్గులు తీసుకుంటే హాయిగా వుంటుంది!

ఆంజనేయులు వంత పలికాడు. వాళ్ళిద్దరూ వెడదాం అంటే వెడదాం అనుకున్నారు. సుందరం "అయితే మీరు అటు వెళ్ళండి. నేను యింటికి వెళ్ళిపోతాను" అన్నాడు.

"నీవు మాకు కంపెనీ యివ్వవా?"

"నీకు తెలుసుగా. ఏమీ పుచ్చుకోను. నాకు టైమ్‌వేస్ట్ మీకు అగ్లీ కంపెనీ. వదిలెయ్యండి నన్ను."

"ఊరికే కూర్చో. యేం పుచ్చుకోవద్దులే"

లోగడ నాలుగైదుసార్లు తను యిలా వెళ్ళడం జరిగింది. కంపెనీ కోసం వెళ్ళి కేవలం కోకాకోల తాగేసి బయటపడ్డాడు. స్నేహితులు తనను మరీ బలవంతం చేసింది లేదు. తనకు తాగాలని అనిపించలేదు. కాకపోతే ముందు ఆ వాసన, వాతావరణం వెగటుగా అనిపించినా తరువాత తరువాత అంత అయిష్టం అనిపించలేదు, సర్దుకు పోగలిగాడు.

"ఎంతసేపు? ఒక్క అరగంటలో ఇంటికి వెళ్ళిపోతాం. కాఫీ తాగటానికి వెళ్ళినా ఇంత టైం పడుతుంది గదా. పద" అన్నాడు మూర్తి.

సుందరం తనుకూడా వాళ్ళవెంట నడిచాడు.

ముగ్గురూ ఓ క్యాబిన్‌లో కూర్చున్నారు. వెయిటర్ అతి వినయంగా వంగి సలాం చేసాడు. ఆంజనేయులు ఆర్డరు యిచ్చాడు.

"ప్రపంచంలో నీ బోటివాళ్ళు వుండడం అరుదోయ్!" అన్నాడు మూర్తి.

"ఏం?"

"ఇంత మడికట్టుకు కుర్చున్న వాడిని నిన్నే చూశాను"

సుందరం నవ్వి వూరుకున్నాడు.

"ఒక్క సిగరెట్ తాగవు. మద్య మాంసాలు సరేసరి! పరాయి ఆడపిల్ల వైపు కన్నెత్తి చూడవు!"

"భాగవతంలో ప్రహ్లాదుడిలాగా...."

ప్రహ్లాదుడైనా మాతృభావనతో చూసేవాడట. మనవాడు అసలు చూడనే చూడడు. ఇంక ఏ భావనతో చూచాడనే ప్రశ్న యేముంది?

ముగ్గురూ నవ్వుకున్నారు.

"నీ జీవితంలో థ్రిల్ లేదంటాను. అంతా సరళంగా సజావుగా ముక్కుకు సూటిగా పోతావు"

"పోనీలే, యిదేం తప్పుమార్గం కాదుగా?"

"తప్పు, ఒప్పు అనికాదు. మనిషి జీవితం యేమీ ఎత్తువల్లాలు లేకుండా ఎగుడుదిగుడులు లేకుండా మానసిక వికారాలు లేకుండా యిలా వుంటే, మోడువారి పోయినట్లు కాదా? యిందులో థ్రిల్ ఏదీ?"

"సిగరెట్ తాగడం, వ్యభిచారం, తాగుడులలో మాత్రమే థ్రిల్ వుండేట్ల యితే ఆథ్రిల్ నాకు వద్దు" అన్నాడు సుందరం.

"థ్రిల్ మాట అలావుంచు. ఏ మానసిక వికారములేకుండా నీకు మనసుకు సంతోషం ఆనందం అనేవి ఎలా కలుగుతాయో అని నాకు ఆశ్చర్యం."

సుందరం నవ్వుతున్నాడే తప్ప యింకేం జవాబు చెప్పడంలేదు.

"కొంతమందికి పుస్తకాలు చదవడంలో థ్రిల్, నువ్వు అంత ఎక్కువగా చదవవు కూడా అనుకుంటాను."

"కొంతమందికి యితరుల సంపదలు చూచి అసూయపడడంతో, యితరుల యోగ్యతలకు, అర్హతలకు మచ్చలు ఎంచడంలో థ్రిల్ వుంటుంది."

"అసలు నువ్వు ఎప్పుడూ ఒక్క సిగరెట్ అయినా ముట్టించలేదా?"

— ఈ ప్రశ్న యిదివరకు ఎన్నోమార్లు వేయడం అయింది. జవాబు వినడం కూడా అయింది. అయినా యిదే ప్రశ్న మళ్ళీ మళ్ళీ.

సంభాషణ యిలాగే కొద్దిసేపు సాకుకు వెళ్ళి "పోనీ ఒక్కసారి - ఒక్క అరపెగ్ రుచి చూడు" అన్నాడు అంజనేయులు.

"అలవాటులేని అవపోసనం"

"మాకు మాత్రం అలవాటా యేమిటి? యేదో అప్పుడప్పుడు తమాషాకోసం! థ్రిల్ కోసం—"

"అసలు అలవాటంటే యేమిటి? ప్రతీ రోజు తప్పనిసరిగా ఆ పని చేయాలి. ఆ పనిచేయకపోతే మనసు, శరీరం చెప్పిన మాట వినకుండా వుండాలి."

అలవాటు వ్యసనంగా తయారవుతుంది. వ్యసనానికి బానిస.

చైనా సామెత ఒకటుంది:

మొదటి గ్లాసు మనిషి తీసుకుంటాడు. మొదటి గ్లాసు రెండో గ్లాసును తీసుకుంటుంది. మూడో గ్లాసు మనిషిని తీసుకుంటుంది అని!

"నన్నడిగితే తాగుడు వ్యసనం కాదంటాను."

"దీంట్లో ఉన్న రుచి..."

"మనం చేయలేని పని మరో మనిషి చేస్తూ వుంటే చూడడం చేతకాక, నీలాంటి నీతిమంతులంతా దీన్ని త్రాగుడనీ, పిశాచమనీ పేర్లు పెట్టారు. నిజంగా యిందులో వున్న మజా నీకేం తెలుస్తుంది."

"ఒక్క గ్లాసు పుచ్చుకు చూడు."

"నీకు రుచిగాలేకపోతే మానేద్దువుగాని."

"నీ గ్లాసుకు డబ్బులు నువ్వు యివ్వక్కర్లేదులే."

సుందరం యింకా తన కోకాకోలాగ్లాసు ఖాళీ చేయనేలేదు. యథాప్రకారం తన గ్లాసు వాళ్ళ గ్లాసులకు దూరంగా వుంచుకున్నాడు.

అంజనేయులు విస్కీ సీసా చేత పట్టుకొని సుందరం గ్లాసులోనికి వంచటానికి ప్రయత్నం చేశాడు. సుందరం తన గ్లాసు పక్కకు తీసుకున్నాడు. మరికాస్త. మూర్తి అంజనేయులు ప్రయత్నానికి దోహదం చేస్తూ పోనీ కాస్త బీరు రుచి చూడు అంటూ బీరు సీసా మూతతీసి ఒక కాళీగ్లాసులో పోసి సుందరం ముందు పెట్టాడు.

"మీరిలా బలవంతం చేసేటట్లయితే నేను వెళ్ళిపోతాను. నా పాలికి నన్ను యిలా కూర్చోనివ్వండి. నా సంగతి మీకు బాగా తెలుసు గదా!"

"లాభం లేదు సుందరం, నీవు యీ రోజు కాస్త పుచ్చుకోవలసిందే. నిన్ను యిలా పస్తు పడుకోబెట్టటం మాకు ఏ మాత్రమూ యిష్టం లేదు" అన్నారు యిద్దరూ ముక్తకంఠంతో.

సుందరానికి గుండె జలదరించినట్లయింది.

ఏమిటి వీళ్ళ ధోరణి?

ఎందుకిలా ఎన్నడూ లేనంత మొండిగా మాట్లాడుతున్నారు? తనకు యిటువంటి వ్యసనాలు యేమీ లేవని ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పొగుడుతూ వుండే మిత్రులేనా వీళ్ళు? పక్కమనిషి నిండా తాగుతూ వున్నా తను మనోనిగ్రహం కోల్పోడని వెయ్యిసార్లు మెచ్చుకుంటూ మాట్లాడే స్నేహితులేనా వీళ్ళు?

సుందరం ఒకమారు టేబుల్ వంక చూచాడు. మూడు కాళీసీసాలు చేరుకున్నాయి అప్పుడే. డజను సోడాబుడ్లు కాళీగా గుమ్మం పక్కన ట్రేలో వున్నాయి. ఇంకా ఒక సీసా నిండుగా వుంది - మూత తెరవలేదు. స్నేహితులు కాస్త మోతాదు మీరా రనిపించింది. సుందరానికి తను మొండి తనంగా వుంటే లాభం లేదు, యేదో తనచేత చేయిస్తేగాని విడవని ధోరణిలో వున్నారు యిద్దరూ.

"మూర్తీ, యిక యింటికి వెడదాం!" అన్నాడు సుందరం గడియారం చూచుకుంటూ.

"అప్పుడేనా, ఇంకా యీ సీసా మూతయినా తీయలేదు."

"దయచేసి ఆ సీసా వాపసుచేయండి, ఇంకచాలు. మీరిప్పుడు యింటికి నడిచివచ్చే పరిస్థితిలో లేరు. అరగంట విశ్రాంతి తీసుకుంటేగాని మామూలు మనుషులు కారు."

అంజనేయులు కళ్ళు మూతలు పడిపోతున్నాయి. మూర్తి తాను ఘటికుడు అన్నట్లుగా కనిపించటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని లేచి నిలుచుంటే - వెంటనే పడిపోవడం తథ్యంఅని సుందరానికి తెలుసు.

స్నేహితులు యిద్దరినీ వదిలేసి యింటికి వెళ్ళిపోదాం అనిపించింది సుందరానికి — ఒక నిమిషం సేపు. తను ముభావంగా వుంటే వీళ్లు తమ పరువు మర్యాదలు మంటకలుపుకోవడమే గాక, తనను కూడా అపవిత్రం చేస్తారు. అయితే యేం చేయడం? ప్రాణమిత్రులలాంటి వాళ్ళను వదిలి — వాళ్ళ కర్మానికి వాళ్ళను వదిలేసి వెళ్ళిపోవడం మంచిపనా? మంచో చెడో, తను యింకో నిముషం ఇక్కడ వుండేటట్లయితే ఈ పాపపంకిలంలో తక్షణం కూరుకు పోయేట్లున్నాడు.

ఇప్పుడు తనేం చేయాలి?

మూర్తి కళ్ళు తేలవేస్తున్నాడు.

అంజనేయులు బల్లమీద వొరిగి జోగుతున్నాడు.

సుందరం యింకా ఆలోచిస్తూ వుండగా బేరర్ వచ్చాడు.

"నువ్వు యిప్పుడు ఉపకారం చేయాలి." అన్నాడు బేరర్‌తో రహస్యంగా. బేరర్ దగ్గరగా వచ్చాడు. "వీళ్ళద్దరూ మన స్పృహలో లేరు. ఓ అరగంటసేపు యిక్కడే వుంటాం. ఆ పూర్తి సీసా మాత్రం తీసుకుపో. నాకు యింకో కోకాకోలా తెచ్చిపెట్టు. వీళ్ళకింకేమీ అక్కర్లేదు." అని చెప్పాడు సుందరం. ఈ మాటలు యేమాత్రం వినిపించినా మూర్తి, అంజనేయులు యింకా విజృంభించి

పని చేయడానికి వీలుంది. సుందరం అందుకనే చాకచక్యంగా వ్యవహరించాలను కుంటున్నాడు.

వాళ్ళకు యిందాకటి లాగా నోటి వెంట మాట రావడంలేదు. గ్లాసులో యింకా కాస్త మిగిలివున్న ద్రవపదార్థాన్ని అందుకుందుకు చేయి ముందుకు చాచుతున్నారు. కాని చేయి ఆ గ్లాసును అందుకోకుండా దాని పక్కనే వున్న గ్లాసును తడుముతోంది. బేరర్‌తో చెప్పి గ్లాసులన్నీ తీసి వేయించాడు సుందరం.

అరగంట గడిచిన తర్వాత పరిస్థితి కాస్త అదుపులోనికి వచ్చినట్లు అనిపించింది. మూర్తి లేచి నుంచున్నాడు. అంజనేయులు పర్సు తెరిచి బిల్లుచూచి డబ్బులు ట్రేలో పడవేయగలిగాడు. సుందరం వాళ్ళను ఆటోరిక్షాలో పడేసి యిళ్లకు పంపించాడు. తను మాత్రం కాలి నడకనే యింటికి వెళ్లాడు. యింటికి వచ్చేంతవరకు యీ రోజు ఎంత అపద (వంటిది) గడిచిపోయిందీ తలచుకుని కాస్త గగ్గోలుపడ్డాడు, ఏ క్షణంలో ఎటువంటి అపద వస్తుందో తెలియక. తను ఎలాగైనా యిటువంటి సన్నివేశాల నుంచి సాధ్యమయినంత దూరంగా వుండాలి. ఏ క్షణంలో ఇతరుల వొత్తిడికి లొంగిపోయి మరో మార్గం లేక కాని పనులు చేయవలసి వస్తుందో! ఏ క్షణంలో తన మనస్సే సహవాసదోషం వల్ల యింగిత జ్ఞానాన్ని కోలుపోతుందో. మూర్తి, అంజనేయులు మాత్రం ఏం చేయగలరు? వాళ్ళు ఏం చేస్తున్నారో వాళ్లకే తెలియదు.

సుందరం యిటువంటి ఆలోచనలతో కంగారుపడిపోతూ యింటికి చేరుకు న్నాడు. ఇంటికి వచ్చిన తర్వాత మామూలు కార్యకలాపాలలో మునిగిపోయినాడు. ఈ విషయాన్ని గురించే తలుచుకోలేదు. తలపోయలేదు. నిద్ర పోవటానికి ముందు కూడా ఈ ఆలోచనలు తన మనసులో వున్నట్లు తెలియదు.

బహుశా యీ సంఘటన తన 'గుప్త మనస్సు'లో గూడుకట్టుకుపోయి - యిటువంటి కల వచ్చిందా?

కలలో ఎవరో తనను బలవంతం చేస్తున్నారు. చీకటిలోకి యీడ్చుకు పోతు న్నారు.

సుందరానికి యిదంతా అర్థం కాలేదు. కాస్సేపు మనస్సును నిరామయం చేసుకుని కళ్ళు మూసుకుని నిద్ర పోయేందుకు ప్రయత్నించాడు.

* * *

మరునాడు సుందరం మామూలుగా ఆఫీసుకు వెళ్ళాడు. మూర్తి, అంజనేయులు కాస్త అలస్యంగా వచ్చారు. తీరుబడి సమయంలో వాళ్ళు కలిసినప్పుడు నిన్నటి సంఘటన చర్చకు వచ్చింది.

"అట్లా నిన్ను బలవంతం చేయడం మా ఉద్దేశం కాదు. మేమేదయినా తొందరపాటుగా మాట్లాడితే క్షమించు" అన్నారు యిద్దరూ.

"నాకు తెలియదా ఆ విషయం? టేకిట్ ఈజీ. మీరేం బెంగపడకండి. నేనేం అనుకోను" అన్నాడు సుందరం.

కాని విచిత్రం యేమిటంటే సుందరం యీ సంఘటనను గురించి ఎంత యిదిగా నచ్చచెప్పకుందామని ప్రయత్నం చేసినా అతనికి యిటువంటి కలే కాస్త ముందు వెనుకలుగా, చిన్న చిన్న వివరాలతో తేడాలతో మటుకు అయిదారు రోజులు వరసగా రాసాగింది.

సుందరం ఈ "రిపిటిషన్" గురించి వెళవెళ పడిపోయాడు.

రోజూ రాత్రిపూట రెండున్నర మూడుగంటల మధ్యలో మెలుకవ వచ్చి తీరాల్సిందే. అంతవరకు వచ్చిన కలను గురించి కాస్సేపు భయపడి - కాస్సేపు మననం చేసుకొని - కాస్సేపు ధైర్యం చెప్పకుని మళ్ళీ నాలుగు గంటల ప్రాంతంలో నిద్రకు పడాల్సిందే. దీనివల్ల అతనికి నీరసం - నిద్ర సరిగా పట్టక పోవడం - శరీర రుగ్మత యేర్పడసాగాయి.

నిద్రలేక పోయినందువల్ల అతని శరీరమే కాకుండా మనసు కూడా అలసిపోసాగింది. కాని ప్రతిరోజూ మూర్తి, అంజనేయులు తనను బార్‌కు యీడ్చుకు పోవడం లేదే? వాళ్లయినా తమ ప్రవర్తనకు సంతాపం వెలిబుచ్చారే. వాళ్ళ జోలి ఎందుకు? తనకు మాత్రం తెలియదూ వాళ్ళకేం దురుద్దేశ్యం లేదని?

దీనిని గురించి తను యేమీ కళవెళ పడకపోయినా యెందుకు పీడకల వచ్చి రోజు తనకు నిద్రపట్టకుండా పట్టి పల్లారుస్తోంది? తన మనసు బాగా బలహీనం అయిపోయిందా? తనమీద తనకే కంట్రోల్ లేకుండా పోయిందా? ఏమయింది అసలు?

సుందరం అలోచనలకు జవాబు ఏమీ దొరకడం లేదు. ఈ విషయం ఎవరితోనూ చర్చించటానికి వీలులేదు. మరీ తీవ్రం అయేట్లయితే యే 'సైకియాట్రిస్ట్'నో చూడవలసి వుంటుంది. ఇంకే మార్గం వుండదు. ఈ విషయం తలుచుకుంటే భయం అయింది అతనికి.

* * *

ఈ రాత్రి కూడా సుందరానికి యిదే కల వచ్చింది.

తల గుమ్మానికి తగిలి నెత్తురు కారుతోంది. చేతితో తడిమి చూసుకున్నాడు. తడి - తడి - తన ధైర్యం అంతా నీరుకారిపోతోంది. కూడగట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. బకాసురుడిలాంటి మనిషి తనను చీకటిలో యీడ్చుకు పోతున్నాడు. "నా వెంట రమ్మంటే యెందుకు రావు?" అని అరుస్తున్నాడు.

సుందరం ఒక్కమారు తన ముఖంలోకి తను చూచుకున్నాడు. తను ధైర్యం చేయాలి. ఎదురు తిరగాలి. ఆ మనిషిని తన్ని తగలెయ్యాలి.

ఆ మనిషి తనచేయి ఒక్కటే పట్టుకున్నాడు. రెండో చేయి తన ఆధీనం లోనే వుంది, ఆ చేతితో తను ఏమయినా చేయవచ్చును. సుందరం ధైర్యం కూడగట్టుకుని రెండో చేయిపైకి ఎత్తాడు. తన కదలికలో - అడుగులు వేయ డంలో కొంత వ్యత్యాసం వచ్చినట్లుంది. ఆ మనిషి ఒక్క మారు ముఖం యిటు వయిపు తిప్పాడు. గండు ముఖం, ఎర్రటి కళ్ళు, నెత్తురు కక్కుతూ వున్నట్లున్నాయి. మొద్దు పెదవులు, బండబారిన ముఖం, భీకరాకారం చూచి సుందరం ధైర్యం అంతా నీరు కారిపోయినట్లు అయింది. ఎత్తిన రెండో చేతి వైపు అతను చూడనేలేదు. అతను చూడగలిగేలోపల యేమయినా చేయాలి తను. అతను చూచాడంటే యీ చేతినికూడా తన కబంధ హస్తాలలో బిగి స్తాడు. అప్పుడు తను చేయగలిందేమీ లేదు. ఒక్క క్షణమో అరక్షణమో వుంది తనకు విరామం' అంతే.

సుందరం తనువంతా పులకరింప చేసుకుని, ధైర్యం కూడగట్టుకుని, 'ఫ్రీ'గా వున్న చేతిని బిగించి పిడికిలి దృఢంగా ముడిచి - ఆ బకాసురుడి ముక్కుమీద గుద్దాడు. అనుకోకుండా తగిలిన యీ దెబ్బకు అతడు వెనక్కు తూలాడు. సుందరం రెండో చేయికూడా ఫ్రీగా తయారయింది. అతను రెండు చేతి పిడికిళ్ళూ గట్టిగా బిగించి అతడి ముఖం మీద - నుదురుమీద బలమంతా ఉపయోగించి గుద్దసాగాడు: అతడప్పుడే పరుగు ప్రారంభించాడు. సుందరం తరు మసాగాడు.

"ఏమండీ, ఏమిటిది? నన్ను యిట్లా కొడుతున్నారు." అంటూ శారద నిద్రలేవడంతో సుందరానికి మెలుకువ వచ్చింది. మెలుకవ రావడంతో - కల అంతా గుర్తు వచ్చేసింది. ఎందుకో తెలీదుగాని అతని మనస్సు చాలా హాయిగా కొత్త "విమ్" పౌడర్‌తో కడిగిన పింగాణి కప్పు లాగ తయారయింది.

అంతే! సుందరానికి మళ్ళీ అటువంటి కల రాలేదు.